# నువ్వే నా బిడ్డవి

సాంబమూర్తి సబ్-రిజిస్ట్రార్‌గా కొంచెం మంచి పేరుతోనే పనిచేస్తుండగా అతని ముప్పైయో సంవత్సరంలో వచ్చిన తీరని నష్టం, అతని సహధర్మచారిణి పరలోక ప్రాప్తి చెందడం. ఇద్దరు చురుకైన మగ పిల్లలకు తల్లియైన సుహాసినికి అప్పుడు ముప్పై సంవత్సరాలు కూడా నిండలేదు. మంచి వాళ్లనే దేవుడు త్వరగా పిలిపించుకుండానేది ఎంతో నిజం! తన భర్తను దైవ సమానంగా ఆరాధించి, తన ఇద్దరు పిల్లల్ని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన ఆ ఉత్తమురాలికి అంతం అనుకోలేని విధంగా వచ్చింది. తొమ్మిది సంవత్సరాల సూర్యప్రకాష్, ఏడు సంవత్సరాల సూర్యకాంత్ ఆరోజు స్కూల్లో వున్నారు. సాంబమూర్తి ఆఫీసులో వున్నాడు. వంటగదిలో పనంతా పూర్తి చేసుకొని, దాదాపు పన్నెండున్నర గంటలవుతుండగా పక్కింటి లక్ష్మి సరస్వతితో మాట్లాడుతూ కూర్చుంది సుహాసిని. అందరితో చాలా కలుపుగోలుగా వ్యవహరించేది ఆ సార్థక నామధేయురాలు. అంతేకాక ఆమె అంటే చుట్ట ప్రక్కల అందరికి ఎంతో ప్రియంగా వుండేది. కాని, ఈ లక్ష్మి సరస్వతికైతే, ఆమెపైన కేవలం మంచి అభిప్రాయం, గౌరవం మాత్రమే కాదు, ఆమెను ఒక కామధేనువులాగా పూజిస్తూ వుండేది. విద్యా దేవిని, ఐశ్వర్య దేవిని కలిపి తనలో ఇముడ్చుకున్న, ఆ దరిద్రోపాసిని సుహాసిని అంటే శ్రీదేవికి, కళాదేవికి ఇద్దరికీ గూడా ఒక విధమైన అప్రియం అయి వుండవచ్చు. ఆమెకున్న విద్యాధనం నాల్గవ తరగతి చదువే. అందుకే మాతృభాషలో ఏదో మిడిమిడిగా మాట్లాడే సమర్థత, కళ్లజోడు లేకుండా వృద్ధాప్యంలో టెలిఫోన్ డైరెక్టరీలో నెంబర్లు వెతికే ఇబ్బందితో ఏవో చదివేకౌశలం వుంది కూడా. తన సొంత పేరు తప్ప వేరే ఏదైనా రాయడానికి ఆమెకు ధైర్యం వుండేది కాదు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో వుండే సుహాసిని ఇంటిలోకి ఆమె కాలు పెట్టింది - అంటే - చేతుల నిండుగా ఏదైనా తీసుకొని పోవలసిందే. వూరికే చూసిపోదామని, సుహాసిని ఇంటికి వచ్చినా, వెళ్లేలోపు ఏదో ఒకటి అడిగి తీసుకుపోవాలని గుర్తుకు తెచ్చుకొనే ఆమె జ్ఞాపక శక్తికి జోహార్లు చెప్పాల్సిందే. ఉప్పు నుంచి కర్పూరం వఱకు అప్పు తీసుకొని వెళ్లే ఆ లక్ష్మి సరస్వతికి, అలాంటి వస్తువులన్నింటినీ తిరిగి ఇవ్వాలనే ఆలోచన వుండి వుండవచ్చు. కాని, సమీప భవిష్యత్తులో వాటిని తిరిగి ఇవ్వటానికి, వీలుకాక పోవటంవల్ల, వాటి లెక్కలు రాసి పెట్టడం అనవసరమే గదా అని ఆమె అనుకుంటే దానిలో తప్పులేదు. స్వతహాగా దానశీలి అయిన సుహాసినికి, లక్ష్మి సరస్వతి నిరంతర అవసరాలకు ఉపయోగపడుతున్నందుకు, సంతోషమే కలిగేది. అంతే కాకుండా పేదరాలయిన ఒక పక్కింటి స్త్రీకి సహాయం చేయడంలో ఆమెకు ఒక రకమైన సంతృప్తి కలిగేది.

ఇదేమిటీ? ఈ లక్ష్మీ సరస్వతి విషయాన్ని ఎత్తుకోగానే అసలు కథ దారి తప్పిందే! చెప్పొచ్చేదేమిటంటే, మధ్యాహ్నం పన్నెండున్నర. అప్పుడు, సుహాసిని, లక్ష్మీ సరస్వతితో మాట్లాడుతూ కూర్చుంది అనేగా? ఆకస్మికంగా సుహాసినికి తీక్షణమైన తలనొప్పి మొదలయింది. రెండు కణతల్ని ఒక చేతితో ఒత్తుకుంటూ పడక గదిలోకి వెళ్లి మంచంమీద ఆమె పడిపోయింది. బాగా చెమటకూడా పట్టింది. ''ఏమైందక్కా? అని అడుగుతూ లక్ష్మీ సరస్వతి కూడా, ఆమె వెనక వెళ్లింది. దుస్సహమైన బాధతో సుహాసిని, మంచంమీద అటూ ఇటూ దొర్లసాగింది. మరో మూడు నిముషాల్లో ఆమె చలన రహిత అయ్యింది. లక్ష్మీ సరస్వతి ఆమెను ఎంతగా కుదిపినా, మొహంమీద నీళ్లు చిలకరించినా, ఆమె కళ్లు తెరవలేదు. లక్ష్మీ సరస్వతి బయటకు వెళ్లి అరవడం మొదలు పెట్టింది. చుట్టపక్కల జనమంతా వచ్చి, ఆమెను చూడగా, కొంతమంది ఒక టాక్సీ తీసుకొనివచ్చి, ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ లోపల ఎవరో సాంబమూర్తి ఆఫీసుకు ఫోన్ చేయడం కూడా జరిగింది. అతను ఆసుపత్రికి చేరేలోగా ఆమె చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారణ చేశారు. మెదడులో అమితమైన రక్తస్రావం మూలంగానే ఆమె చనిపోయినట్లు డాక్టర్లు అభిప్రాయపడ్డారు.

ఆ సమయంలో, సాంబమూర్తి కళ్లముందు వ్యాపించిన ఘోరాంధకారము క్రమంగా, అతని హృదయంలోకి దిగి, అతని జీవితకాలమంతా అక్కడే గడ్డకట్టి వుండి పోవటానికి నిర్ణయించుకుంది.

రోజులూ, నెలలూ, సంవత్సరాలు గడిచిపోయాయి. తన ఆత్మసఖిని తలచుకొని, కన్నీరు కార్చకుండా లేని దినాలు అతని జీవితంలో అరుదుగా వుండేవి. ఆ దేవి ప్రతిరూపాలయిన ఇద్దరు పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తెలియకుండా, మాతృరాహిత్యము ఆ పిల్లల మనసుల్ని స్పృశించకుండా అతను పెంచాడు. సూర్యప్రకాష్‌కూ, సూర్యకాంత్‌కూ సాంబమూర్తే తల్లీ తండ్రి. ఆ ఇంట్లో పనివాడు వున్నా కూడా మొత్తం వంటపని సాంబమూర్తే చేసేవాడు. పిల్లలకు నచ్చిన ఫలహారాన్ని అతనే రుచికరంగా తయారు చేసి ఇచ్చేవాడు, కొన్ని పదార్థాలు బయటనుంచి తెప్పించేవాడు కూడా.

సూర్యప్రకాష్ డాక్టర్ కావాలనీ, సూర్యకాంత్ ఇంజనీర్ కావాలని బ్రతికి వున్నప్పుడు సుహాసిని ఆశించేది. పిల్లలిద్దరు కూడా చదువులో చాలా సమర్థులయినవాళ్ళే. అంతేకాక, నిరంతర ప్రోత్సాహం, వాళ్లకు ద్విగుణీకృతమైన శక్తిని ప్రసాదించింది.

మొదటి పిల్లవాడు M.B.B.S. పాసయ్యాడు. తరవాడ E.C.F.M.G. పరీక్షలో ఉత్తీర్ణుడై అతను అమెరికాకు ఎగిరిపోయాడు. సాంబమూర్తి మనసులో ఒక చీలిక ఏర్పడింది. అది అతనికి సతత వ్యధ కలిగించింది. ఏమైనా గాని తన ఇద్దరి పిల్లలకు ఎలాంటి ఇబ్బందిగానీ, బాధగాని రాకూడదనే అతని ప్రధాన జీవితాశయం. ఆ కారణంవల్లనే

రెండో పెళ్లి గురించి, ఆలోచించడం కూడా అతనికి ఇష్టంగా వుండేది కాదు. అంతే కాకుండా సుహాసిని స్థానంలో ఇంకొక స్త్రీని ప్రతిష్ఠించడమంటే అదొక అచింత్యనీయమైన విషయంగా వుండేది. తన ప్రాణసమానమైన ప్రియపత్నినే, ప్రతిరోజూ మనసులో ధ్యానించుకొని, ఆ స్నేహమయి సుకుమార రూపాన్ని, తన ఇద్దరి సుకుమారుల్లో దర్శించుకొని అతను ఇప్పటివరకు ఎన్నో సంవత్సరాలు గడిపాడు. పెద్దవాడు 'అమెరికాకు వెళ్లడంవల్ల అతనికి కలిగిన బాధ... ఆ వియోగ దుఃఖ కాఠిన్యం... కొంచెం కూడా తగ్గలేదు. ఈ లోపల అంటే మూడు సంవత్సరాల లోపల అన్నయ్య ఆహ్వానం ప్రియ తమ్ముడికి లేఖ ద్వారా రావడం జరిగింది. ఇంజనీర్ అయిన సూర్యకాంత్ కు మంచి జీతం వచ్చే ఒక ఉద్యోగం, సూర్యప్రకాష్ చూసి పెట్టాడట. రెండో వాణ్ణి కూడా విదేశానికి పంపడం సాంబమూర్తికి కొంచెం కూడా ఇష్టముండేది కాదు. కొడుకుతో ఇది చర్చించే సమయంలో, తనకు రాబోతున్న ఒంటరి తనం గురించి ఆయన చెప్పలేదు గాని, అతని సజల నేత్రాలు, భవిష్యత్తు గురించి, అతనిలో వున్న భయం, బాధ, దీనంగా తెలియజేశాయి. కాని సూర్యకాంత్...

''ఓ డాడ్ ! ప్లీజ్ ట్రైటు అండర్ స్టాండ్ మి. ఇక్కడ నాకు ఏం భవిష్యత్తు వుంటుంది? మెకానికల్ ఇంజనీరింగు ఫస్టుక్లాసులో నేను పాస్ అయిన తర్వాత ఇక్కడ నా కొచ్చే జీతమెంత? నా కొచ్చేదాని కంటే ఎక్కువ, మా కంపెనీ సీనియర్ డ్రైవర్ కు వస్తుంది. మరి దీనివల్ల నాకేం వర్క్ సాటిస్ ఫ్యాక్షన్ వస్తుంది? ఇక్కడ ఎంత కష్టపడి పని చేసినా పైకి రావడానికి ఎలాంటి ఛాన్సు లేదు. అయినా అమెరికాకు వెళ్లి అక్కడ స్థిరపడిపోవాలని ఎలాంటి ఉద్దేశ్యం లేదు. కొంతకాలం అమితపని చేసి, మంచి సంపాదనతో తిరిగి వచ్చి ఇక్కడ ఒక ఇండస్ట్రీ మొదలు పెట్టాలనే నా ఆశ. ఏమయినా బతకడానికి, మన దేశంలోనే సుఖంగా వుంటుంది. కాని, అలా సుఖంగా బ్రతకటానికి కావాల్సిన డబ్బు సంపాదించాలంటే కొంతకాలం, బయట దేశాలకు వెళ్లి, కష్టపడి పనిచేయడం తప్పదు'' అని తండ్రికి జ్ఞానోపదేశం చేశాడు.

సూర్యకాంత్ కూడా వెళ్లిపోయాడు. సాంబమూర్తి ఏకాకి అయ్యాడు. మూడు, నాలుగు సంవత్సరాలపాటు ఇంకా సర్వీసు వుండడంవల్ల పగటిపూట అతనికి ఎక్కువగా బోరు కొట్టేది కాదు. పాతరోజుల్లో కూడా దినచర్య అదే కదా! పిల్లలిద్దర్ని కాలేజీలకు పంపించిన తర్వాతనే తాను ఆఫీసుకు బయలు దేరేవాడు. ఆఫీసు కాగానే త్వరగా ఇంటికి చేరేవాడు. పిల్లలకు తినడానికి, దారిలోని బేకరీనుంచి ఏదైనా తీసుకొని వచ్చేవాడు. సాయంత్రం పిల్లలు బాగా అలసిపోయి వచ్చినప్పుడు వాళ్లకు మంచి ఆహార పానీయాలు ఇవ్వడం అతనికి సంతోషదాయకం.

కాని, ఇప్పుడు?

పగటిపూట ఎలాగో గడిచిపోతుంది. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లడానికి అతనికి మనసు వచ్చేది కాదు. క్లబ్బులకో లేక స్నేహితుల ఇళ్లకో వెళ్లి కాలం గడిపే స్వభావం సాంబమూర్తికి మొదటి నుంచీ వుండేది కాదు. సంధ్యాసమయంలో, ఇంటికి తిరిగి చేరితే, ఒక కారాగారంలో ఒంటరిగా వున్నట్టు అనిపిస్తుంది. మామూలుగా రాత్రుల్లో రెండు అరటి పళ్లు తిని ఒక గ్లాసు పాలు తాగి ఆయన నిద్రపోయేవాడు. పిల్లలు లేకపోవడం వల్ల, ఏమైనా స్వయంగా వంటచేసుకొని తినాలంటే ఓపిక వుండేది కాదు. దివిలో కూర్చుని తన ఏకాంత వాసంలో అనుభవిస్తున్న దుఃఖాల గురించి, తన ప్రాణ సఖి కన్నీరు చిందిస్తుందేమో అని ఆలోచించి, అతను గంటల తరబడి నిద్రతో మల్లయుద్ధం చేసేవాడు.

ఇప్పుడే ఇంత దుర్భరంగా ఉంటే ఇక రిటైర్ అయిన తర్వాత తన కేమౌతుందో? ఎలా ఉంటుందో?

దానికి ఇంకా రెండు సంవత్సరాలు వుండగానే సాంబమూర్తి హృదయానికి భరించరాని ఒక దెబ్బ తగిలింది.

ముందుగా ఎలాంటి సూచన పంపకుండా ఒకరోజు సూర్యప్రకాష్ పత్నీ సమేతంగా వచ్చేశాడు. నర్స్‌గా పనిజేసే ఒక అమెరికా అమ్మాయితో ప్రేమ బంధం ఏర్పడిన సూర్యప్రకాష్‌కు, తన పెళ్లివార్త తండ్రికి తెలపడమే కొంచెం భయంగా వుండేది. పెళ్లికి తమ్ముడు సూర్యప్రకాష్ హాజరయినా గూడా అ అన్నదమ్ములు సాంబమూర్తికి ఒక "సర్‌ప్రైజ్" ఇవ్వడానికి నిశ్చయించుకున్నారట. హృదయానికి సహస్రకంటకాలు గుచ్చుకున్నట్టు అనిపించినా గూడా సాంబమూర్తి ఆ (హలో డాడ్ - కోడలు)మెకు ఎలాంటి పెడముఖం చూపించలేదు. వచ్చిన రోజు రాత్రి భోజనానికి, సాంబమూర్తిని తను వెంట హోటల్‌కు తీసుకొని వెళ్లడానికి ప్రయత్నం చేశారు. కాని, ఆరోగ్యం బాగు లేదని చెప్పి ఆయన తప్పించుకొన్నాడు. మరోజు సాయంత్రం వాళ్లు వూరు వదిలారు. పదిహేను రోజులపాటు భారతదర్శనం చేసిన తర్వాత, తిరిగి విదేశానికి వెళ్లేముందు ఒకసారి డాడీతో చెప్పి పోదామనే సహృదయతను ప్రకటించడానికి వాళ్లు హైదరాబాదుకు రావడం జరిగింది. కోడలు షర్లీకి ఈదేశం బాగా నచ్చిందట. వీడ్కోలు సమయంలో పాదనమస్కారానికి బదులుగా ఆ కోడలు సాంబమూర్తి చెంపకు ఒక చుంబనం అందించింది. మళ్లీ ఎప్పుడొస్తారని ఆ తండ్రి అడిగేటప్పుడు, అది కచ్చితంగా చెప్పడం కష్టమని, ఆ ప్రథమ పుత్రుడు చెప్పడం జరిగింది. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా, రిటైర్‌మెంటు తీసుకొని, సాంబమూర్తిని కూడా అమెరికాకు వచ్చేయడమే మంచిదని సలహా ఇచ్చాడు. రెండు సంవత్సరాల తర్వాత గూడా తిరిగి రావడం విషయంలో, సూచనలు ఏమీ ఇవ్వలేని సూర్యకాంత్ గురించి అడిగినప్పుడు 'ఓహ్, డాడీ, హి ఈజ్ ఓన్లీ సెటిలింగ్ డౌన్, కనీసం ఇంకొక సంవత్సరానికి, ఈవైపు రావడం గురించి ఆలోచించడానికి కూడా అతనికి సమయం

దొరకదు. లెట్ హిమ్ మేక్ సమ్ మనీ, ఇన్ ద మీన్ వైల్'' అని సూర్యప్రకాష్ ఒక ప్రాక్టికల్ జవాబు ఇచ్చాడు.

రెండోవాడు కూడా తక్కువ వాడేం కాదు. మొదటివాడు మూడు నెలల కొకసారి ఉత్తరం రాస్తే, రెండో వాడు నెలకొక సారి రాసేవాడు. అతని ఉత్తరాల్లో పెద్దవాడి ''మ్యాటర్ ఆఫ్ ఫ్యాక్ట్'' విధానం నుంచి కొంచెం భిన్నంగా, ఒక ఇరవైఐదు శాతం ప్రేమ భావం స్ఫురించేది. పెద్దవాడి లాగ సూర్యకాంత్ పెళ్ళి విషయంలో మూర్ఖత్వం చూపించడని సాంబమూర్తికి నమ్మకం వుండేది. కాని...

సూర్యప్రకాష్, అతని భార్య వచ్చి వెళ్లి ఆరునెలలే అయింది. అంతలోనే సూర్యకాంత్ నుంచి ఒక పొడుగాటి ఉత్తరం వచ్చిందని సాంబమూర్తి సంతోషించాడు. అయితే అంతా చదివాక పెద్దవాడికంటే అతనుకూడ ఏం తక్కువ వాడు కాదని అనిపించింది. అతనితోపాటు పనిచేసే ఒక బ్రాహ్మణుల అమ్మాయిని అతను ప్రేమిస్తు న్నాడనీ, ఆమె స్వస్థలం విజయవాడ అనీ, ఆమె తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించా రనీ, ఆమె పాక కళలలో కూడా సమర్థురాలనీ, అవసరమయితే మాంసాహారాన్ని కూడా 'బాగా రుచికరంగా తయారు చేయగలదనీ, వీటన్నింటినీ మించి ఆమె సుందరియు, సుశీలయూననీ ఆ పొడుగాటి ఉత్తరంలో ఉంది.

అయితే వివాహం జరిగే తేదీ ఇంకా నిశ్చయం కాలేదనీ, ఆమె తల్లిదండ్రులు వారి వివాహానికి అమెరికా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారనీ, తాను అమెరికా వెళ్ళడానికి ఎప్పుడు వీలయితే

అప్పుడు తేదీ నిర్ణయిస్తామనీ ఆ బంగారు కొడుకు ప్రేమ పూర్వకంగా రాసిన వాక్యాలు చదువుతుంటే సాంబమూర్తి కళ్ళు నీళ్ళతో నిండాయి.

ఆ ఉత్తరాన్ని సుహాసిని ఫోటో ముందు పెట్టి ''చూడు సుహాసినీ! నీ రెండో కొడుకు కూడ తనకు నచ్చిన అమ్మాయిని తనే చూచుకున్నాడు. నీవు కాలం చేశాక ఇద్దరబ్బాయిలనూ ఏ దుఃఖం తెలియకుండా పెంచాను. వాళ్ళు సమర్థులయ్యారు. మనకంటె చాలా మెరుగ్గా అన్ని సుఖాలతో వాళ్ళు బతుకుతున్నారు. పెద్దవాడు తెల్ల అమ్మాయిని చేసుకున్నాడు. రెండోవాడుకూడ అతని సెలక్షన్ అతనే చేసుకు న్నాడు. కానీ నేను వెళ్ళకపోతే అతను పెళ్ళే చేసుకోను అనయినా రాశాడు: అదే సంతోషం. కనీసం అతను చేసుకుంటున్నది ఒక తెలుగు పిల్లనే కదా. మన కులం కాకపోయినా ఆమె బ్రాహ్మల పిల్లేకదా... ఫరవాలేదు కానీ, సుహాసినీ! నిన్ను వదలిపెట్టి నేనెక్కడికీ వెళ్ళలేను. పెళ్ళి తరువాత కావాలంటే అతన్నే భార్యతో కలిసి ఇక్కడికి వస్తాడు. ఏమయినా, మన పిల్లలు సుఖంగా ఉండడానికి మన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి కదా! అయితే, మన ఇద్దరి పిల్లలుకూడ మన అంగీకారం లేకుండానే తమ

పెళ్ళిళ్ళు తామే తీర్మానించుకున్నారే! నీవు వుంటే వాళ్ళలా చేసే వాళ్ళా? ఇలా వాళ్ళంతట వాళ్ళు చేసుకుంటే నువ్వు ఒప్పుకునేదానివా?''

గాలికి ఆ సుహాసిని సుందరమైన ఫోటో మెల్లగా ఊగింది. దాన్ని చూచి సాంబమూర్తికి ఆమె యేదో చెప్పడానికి ప్రయత్నం చేస్తోందని అనుమానం వచ్చింది. ఫోటోలోని ఆమె చిరునవ్వుకు మాధుర్యం ఎక్కువ కాలేదా? లేక అది నన్ను పరిహరించే నవ్వా?

ఏం ఫరవాలేదు సుహాసినీ' నాకింకా ఎంతకాలం ఉంది? ఎంత తొందరగా వీలుంటే అంత తొందరగా నీదగ్గరకు రావడమే నాకిష్టం. ఈ సూర్యప్రకాశ్ చూడు... ఏం చేశాడో? అతను సమర్థుడయ్యాడు, తన కాళ్ళమీద తాను నిలబడే స్థితి వచ్చేటప్పటికి అతనికి అమ్మావద్దు... నాన్నా వద్దు... సరే, సూర్యకాంత్ కయితే కొంచెం ఎక్కువ ప్రేమ ఉన్నట్లు అనిపిస్తోంది. కనీసం పెళ్ళికయినా నన్ను రమ్మని పిలిచాడు కదా! కానీ! నేనెక్కడకు పోవడం లేదు సుహాసినీ! నేనెక్కడకూ పోను. నీ జ్ఞాపకాలతోను, ఈ అద్దె ఇంట్లోనే చచ్చిపోయేంత వరకు బతకడానికి నిర్ణయించుకున్నాను. మన పిల్లలు, వాళ్ళ భార్యలు కావాలంటే అప్పుడప్పుడు వచ్చి చూచిపోనీ! నాలుగయిదు సంవత్సరాలక్కడ ఉండి తిరిగి వచ్చేస్తానని సూర్యకాంత్ అనేవాడు. కానీ ఇప్పుడా బాపనమ్మాయిని చేసుకున్నాక ఏమో... తిరిగి రాడేమో... అంతా దైవనిశ్చయమే. నీవు నన్ను వదిలి వెళ్ళినపుడే నాకు తెలుసు నా శేషజీవితం ఇలాగే ఉంటుందని...''

అతని కళ్ళ నుంచి నీరు ధార కట్టింది... అలా అతని విషాదాగ్నిలో వెచ్చనయింది ఆ కన్నీరు.

కాలం ఎవరికోసం ఆగుతుంది? సాంబమూర్తి పదవీ విరమణ చేశాడు. పిల్లలకు తనమీద ప్రేమ తక్కువయిందన్న బాధవల్లనో, ఏకాంత వాసంలోని దుస్సహత్వం వల్లనో వార్థక్యం మీద పడబోతోందన్న ఆందోళన వల్లనో ఆయనలో వార్థక్య లక్షణాలు వయసుకు మించి ఎక్కువై రక్తపోటు, మధుమేహం మొదలైన రోగాలు ప్రాప్తించాయి.

సంవత్సరాలు దొర్లిపోయాయి. సాంబమూర్తికి ఇప్పుడు అరవై ఐదు సంవత్సరాలు. పైకి చూస్తే, డెబ్బైయ్యేదు సంవత్సరాలున్న వాడిగా కనిపించడమే కాకుండా లోపల వున్న ఎముకలన్నింటిని బయటనుంచి లెక్కపెట్టవచ్చేమో నన్నట్లు ఉన్నాడు.

ఈ సప్తవర్షాల మధ్యలో ఇద్దరు కొడుకులు పత్నీ సమేతంగా హైదరాబాదుకు రావడం జరిగింది. మొదటివాడు, వాడి భార్య వచ్చినప్పుడు, వారి కొడుకును గూడా తీసుకొచ్చారు. ఆ బిడ్డకు, వాడి తల్లిపోలికతో అమెరికన్ రూప భావాలున్నాయని గమనించిన సాంబమూర్తికి తన హృదయాన్ని ఎవరో ముల్లుతో పొడిచినట్లు అనిపించింది. వినోద సంచారుల్లా వాళ్లు వచ్చారు. రెండురోజులు వున్నారు. అందులో గూడా

ఎక్కువ సమయం వాళ్లు బయటనే గడిపారు. ఆ తెల్ల మనుమడి మీద తాతగారికి మమకారం కలిగిందో లేదో అని గట్టిగా చెప్పడం కష్టం.

బ్రాహ్మణులమ్మాయిని పెళ్లి చేసుకుని ఏడేళ్లయినా సూర్యకాంత్‌కు సంతానం కలుగలేదు. అతను సెలవుల్లో హైదరాబాద్‌కు వస్తే, సాంబమూర్తికి కొద్దిగ ఊరట కలిగినట్టు వుంటుంది. ఎందుకంటే, ఎక్కువ సమయం బయట తిరగకుండా ఆ భార్యా - భర్తలు కనీసం పదిరోజులు సాంబమూర్తి దగ్గరే వుంటారు. ఇంటికి కోడలు వస్తే పండుగే కదా! సావిత్రి అనే పేరున్న ఆ రెండో కోడలు మామగారిని బాగా చూచుకుంటుంది. కొంచెం ఎక్కువ మాట్లాడే స్వభావం ఆమెది. ఆమెను మొదటి సారి చూచినపుడు, ఆ తరవాత రెండు రోజుల వరకు ఆమెతో మాట్లాడడం అతనికి సిగ్గుగా వుండేది. కాని, ఆమె వదులుతుందా? కావాలంటే పట్టుకుని కింద పడేసి మాట్లాడుతుంది. సాంబమూర్తికి ఆ కోడలు చాలా నచ్చింది. ఆమెకు త్వరలో సంతాన భాగ్యం కలగాలని ఆయన భగవంతుణ్ణి ప్రార్థించాడు. వాళ్లు దగ్గర వుండేటప్పుడు సాంబమూర్తికి దీపావళి పండగలాగ వుండేది. కాని, వాళ్లు వెళ్లిపోయిన తర్వాత ప్రపంచంలో వున్న చీకటంతా తన ఇంటిలోనే స్తంభించి పోయినట్లు అతనికి అనిపించింది. సంవత్సరానికి ఒకసారి ఇద్దరు కొడుకులూ తప్పకుండా సెలవు తీసుకుంటారని, అలాంటి సెలవుల్లో, ఏదైనా బయట దేశానికి వెళ్లిరావడమే వాళ్లకు లాభదాయకమని సాంబమూర్తికి కూడా తెలుసు. దాన్ని గురించి సూర్యకాంత్‌తో మాట్లాడడం గూడా జరిగింది. ప్రతిసంవత్సరం ఒక రెండు వారాలు, తన దగ్గరకు వచ్చి వుండకూడదా అని ఆ వృద్ధుడు అడిగాడు. ప్రయత్నం చేస్తాం అని అతడు సమాధానమిచ్చాడు. కాని, గడచిన నాలుగు సంవ్సరాలలో అతను ఒక్కసారే తన దగ్గరకు వచ్చాడు.

ఈ ప్రపంచంలో సాంబమూర్తికి తనవని చెప్పడానికి భార్య జ్ఞాపకాలు, తదనుగుణమైన దుఃఖాలు, వాటివల్ల సంభవించిన రోగాలు మాత్రమే వున్నాయి. అలాంటి మూడురకాల పీతల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే వచ్చింది.

ఆ యాతనల ఘోషయాత్ర, అతణ్ణి అరవై ఐదు వయస్సులో ఆసుపత్రిలో పడవేసింది. అది ఒక తీవ్రమైన గుండెపోటు. ఆ ఇంటికి ఉత్తరంగా ఉన్న దక్షిణామూర్తి ఆ వివరాన్ని ఫోనుద్వారా సాంబమూర్తి కొడుకులిద్దరికి తెలియజేశాడు. నాలుగోరోజు వాళ్లిద్దరూ రావడం కూడా జరిగింది.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న సాంబమూర్తి ఆరోగ్యం, ఆ నాలుగోరోజు వచ్చేలోపల కొంచెం మెరుగయింది. ఇద్దరు కొడుకులు కలిసి ఒకేసారి రావడం అతనికి చాలా సంతోషం అనిపించింది. కాని ఆ సుఖం, అతనికి ఎక్కువ సమయం దక్కలేదు. ఇంక భయపడడానికి ఏమీ లేదు... డాక్టర్లతో చెప్పి అన్ని

ఏర్పాట్లు పూర్తి చేశాం... నాలుగైదు రోజుల్లో ఇంటికి తిరిగి వెళ్లవచ్చు... ఇంటికి వెళ్లిన తరువాత గూడా కొద్ది రోజులకు అక్కడ ఎల్లప్పుడూ ఒక నర్సు వుండడానికి కూడా ఏర్పాటు చేశాం... స్థిరంగా ఒక పని కుర్రాణ్ణి పెట్టడం కూడా మంచిది... దేన్ని గురించి కూడా బాధ పడొద్దంది... డబ్బు విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా మేము చూసుకుంటాం... ఎక్కువ రోజులు సెలవు దొరకడం కష్టం... ఎమర్జన్సీ కావడం వల్ల పరుగెత్తుకొని వచ్చాం... త్వరగా తిరిగి వెళ్లకపోతే ఉద్యోగాలకే ముప్పు వస్తుంది... అని చెబుతూ, ఉపదేశిస్తూ ఆ ప్రియ పుత్రులు మరుసటి రోజు తిరుగు ప్రయాణమయ్యారు. ఆ ఒక్క కారణం వల్ల సాంబమూర్తికి మరొక్కసారి గుండెపోటు రావడానికి అవకాశం వుండేది. కాని ఆయన తన గుండె నొప్పిని పెదవిలోనే బిగబట్టి ఉపశమింప చేయడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో అతని కళ్ళనుంచి వెల్వడిన కన్నీరు ఆయన వెచ్చని దీర్ఘ నిశ్వాసాలను తడిపి ఆ వృద్ధునికి ఊరట కలిగించింది.

రెండు వారాలు ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత, తన ఏకాంతవాన ఖైదుకు సాంబమూర్తి తిరిగి వెళ్లారు. పూర్తి విశ్రాంతి తీసుకోవాలని డాక్టరు సలహా, అలాంటి సలహా లేకున్నా అతనికి లేవడానకి శక్తి ఏమాత్రం లేదు. అందుకనే చాలా మటుకు పడుకునే వున్నాడు. ఎప్పుడో ఒకసారి, కొద్దిసేపు వెనక రెండు దిండ్లు పెట్టుకొని చేరగిలబడేవాడు. దక్షిణమధ్య రైల్వే నుంచి రిటైర్ అయిన తర్వాత, తనకు ప్రక్క ఇంట్లోనే చేరిన దక్షిణామూర్తిని తలుచుకున్నప్పుడంతా అతని కళ్లల్లో అశ్రువులు నిండేవి. తమిళుడయిన దక్షిణామూర్తి, అతని భార్య వారి ఒకే ఒక పుత్రుడు వెంకట్ ఎప్పటి నుంచో సాంబమూర్తికి సహాయంగా ఉన్నారు.

వెంకట్ ఇప్పుడు ఇంటర్‌మీడియట్ చదువుతున్నాడు. అప్పుడప్పుడు సాంబ మూర్తి ఇంటికి వాళ్ళు ముగ్గురు వచ్చి వెళ్లేవారు. కాని, గుండెపోటు వచ్చిన తర్వాత, వాళ్లు ముగ్గురు ఆయనకు సంతత సహచరులుగా వుంటూ, అప్పుడప్పుడూ తన స్వంత ఇంటికి వెళ్లేవారు. ఎక్కువ సమయం అతనితోనే గడిపేవాడు వెంకట్. ఇంటిపని కోసం ఒక పనివాడు వున్నాడు కాని, అతనికి ఎక్కువ సేపు వంటగదిలో నేలను ఊడ్చడం, తుడచడంతోనే సరి. అందువల్ల ఎక్కువసేపు సాంబమూర్తిని చూసేవాడు కాదు. అతనితో పనిచేయించడం కూడా దక్షిణామూర్తి అండ్ కంపెనీదే బాధ్యత. వాళ్ళు ముగ్గురూ ఎంత బాగా చూసుకున్నప్పటికి సాంబమూర్తి ఆరోగ్యం రోజు రోజుకు క్షీణించడం, అతనిలో నిరాశాభావం వృద్ధికావడం చూచి వాళ్లు ఎంతో బాధపడ్డారు. అపుడప్పుడు వచ్చి చూసే డాక్టరు దక్షిణామూర్తితో సాంబమూర్తి జబ్బంతా అతని మనసులోనే వుంది. 'హి డసంట్ హేవ్ విల్ టు లివ్'. ఆరోగ్యం కొంచెం కుదుట పడ్డ తర్వాత, అమెరికాలో ఇతని పిల్లల దగ్గరకు పంపించడమే మంచిది. ఛేంజ్ ఆఫ్ ప్లేస్, ఆ అట్మాస్ఫియర్ ఇతనికి ప్రయోజనకరంగా వుండ

వచ్చు'' అని చెప్పేవాడు. చాలాసార్లు దక్షిణామూర్తి , ఈవిషయం సాంబమూర్తితో చర్చించాడు కాని ''నా కిక్కొడికీ వెళ్లాలని లేదు. ఇక్కడే వుండి కళ్లు మూస్తేనే నాకు తృప్తి'' అని సాంబమూర్తి ఒకే ఒక స్థిరమైన జవాబు ఇచ్చేవాడు.

వెంకట్, సాంబమూర్తికి ఎంతో దగ్గరగా వుండేవాడు. సాంబమూర్తికి, వెంకట్ అంటే తన ప్రాణం కంటే ఎక్కువ ఇష్టంగా వుండేది. వాళ్లద్దరి మధ్య ఏదో ఒక పూర్వజన్మ బంధం యొక్క తీక్షణ ప్రభావం వున్నట్లు ఉండేది. వాళ్లిద్దరికే కాదు, దక్షిణామూర్తి, ఆయన భార్యకు కూడా అలాగే అనిపించేది. ఎంత సమయం సాంబమూర్తి దగ్గర గడిపినా, అది వెంకట్‌కు తక్కువే అనిపించేది. పెద్దాయాన ఆరోగ్యం బాగు పడాలని వీలయినంత వఱకు సేవలు అందించడమే కాకుండా, ఎన్నెన్నో గుళ్లకు వెళ్లి పూజలు జరిపించి, మొక్కుకోవడం కూడా చేశాడు

ఒకరోజు, సాంబమూర్తి మంచంమీద కూర్చుని అతని చేతిని ఒత్తుతూ కూర్చు న్నాడు. అతని ముఖం కొంచెం ఎక్కువ నల్లబడ్డట్టూ, ఆయనకు బాధనో. వేదననో ఎక్కువ అయినట్టు వెంకట్‌కు అనిపించింది. ప్రేమ - పూర్వకంగా అతను దానికి కారణం అడిగితే, ఒక దీర్ఘ నిశ్వాసంతో సాంబమూర్తి ''నాయనా! వెంకట్ నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలని చాలా రోజులనుంచి అనుకుంటున్నాను. ఇంక నేను ఎక్కువ రోజులుండను'' అని ఆయాసంతో చెప్పాడు. ''అలాంటి అశుభమయిన మాటలు చెప్పొద్దండి అంకుల్ - కొన్ని రోజులకు మీ ఆరోగ్యం బాగుపడుతుంది, మనం ఇద్దరు కలసి ఊరంతా తిరగాలి కదా'' అని కొంచెం మందలించే విధంగా, దుఃఖంతో ఆ అబ్బాయి అన్నాడు. ''లేదు నాయనా లేదు, లేకపోతే నేను ఎవరి కోసం పరిగెత్తాలి? తప్పటడుగులు వేసే చిన్నపిల్లలు వుంటే, ఈ తాతకు వాళ్లతో ఆడుతూ, పాడుతూ కాలం గడపడానికి బాగా వుంటుంది. కాని, అలాంటి అదృష్టం ఈ పాపిష్టి వాని తలరాతలో లేదే?''... సాంబమూర్తి కళ్లలో మంచి వేడి కన్నీరు ప్రవహించింది. వెంకట్ ఇంకా దగ్గరగా జరిగి అతని కన్నీరు తుడిచాడు కాని, అప్పుడు అతని కళ్లు కూడ నిండాయి. ''అంకుల్, మీరు అమెరికాకు వెళ్లాలనుకొనుంటే, ఎప్పుడో వెళ్ళేవారు కదా! అక్కడ పిల్లలు, పిల్లల పిల్లలతో సుఖంగా హాయిగా వుండకూడదా? అంకుల్ సూర్యకాంత్ అన్నయ్యకు ఒక ఉత్తరం రాయి... అన్నయ్య పరిగెత్తుకొస్తాడు''

''వాళ్లిద్దరూ మొన్ననే గదా పరుగెత్తుకొచ్చారు. మళ్లీ నాలుగు రోజులు కూడా వుండకుండా అలాగే పరుగెత్తుకెళ్లారు. అలా అడపాదడపా పరుగెత్తి రావడానికి వాళ్లు విజయవాడలో వున్నారా? విశాఖపట్నంలో వున్నారా? అంత ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి రావడానికి వాళ్లకు చాలా ఇబ్బంది అవుతుంది. వాళ్ల లోకం వాళ్లది - మన లోకం మనది.''

''అలా ఏమీ కాదు అంకుల్. ఈ సమయంలో కాకపోతే సొంత బిడ్డలకు తండ్రికి సేవ చేయడానికి ఎప్పుడు వీలవుతుంది? లేకపోతే నేనే సూర్యకాంత్ అన్నయ్యకు ఒక ఉత్తరం రాస్తాను. ఆ అన్నయ్య చాలా మంచివాడు. మీరంటే అతనికి ప్రాణం. కనీసం ఒంటరిగానైనా కొన్ని రోజులు ఇక్కడ వచ్చి వుంటాడు.''

''వద్దు నాయనా వద్దు. వాళ్ళిద్దరూ ఈ మధ్యనే వచ్చి వెళ్లారు గదా. వాళ్లకు ఈ ముసలివాణ్ణి ఇంకా చూడాలని వుంటే వాళ్లే వస్తారు. అమెరికాకు వెళ్లి సుఖంగా బతికేవాళ్లు - మానవ బంధాలు అన్నీ మరచిపోతారు. వాళ్లు ప్రేమిస్తే ఒక ఒక వస్తువును మాత్రం ప్రేమిస్తారు. అది డాలర్. అదంతా ఆలోచించి మనమెందుకు తల బద్దలు కొట్టుకోవాలి? నేను చెప్పేది నువ్వు కొంచెం శ్రద్ధగా విను. నా ఊపిరి ఎప్పుడాగి పోతుందో నాకే తెలియదు. ఏమైనా దానికంతా ఇక టైమ్ లేదు. నేనింకా చెప్పబోయేదా నికి, ఎదురు చెప్పొద్దు. ఇది నా చివరి కోరిక.''

వెంకట్‌కు ఏమీ అర్థం కాలేదు. సాంబమూర్తికి ఏమైంది అని అతను బాధ పడ్డాడు. సాంబమూర్తి కొనసాగించాడు ''నాయనా నువ్వే నా బిడ్డవి. ఈ జన్మలో నీ తలిదండ్రులు వేరే కావచ్చు గాని, గత జన్మలో నువ్వే నా కొడుకువయి ఉంటావు. నాకింకొక జన్మ వుంటే, నువ్వే నాకు కొడుకుగా పుట్టాలని, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. నాకు నువ్వంటే అంత ప్రేమ. నువ్వు నన్ను ఎంత మంచిగా చూసుకుంటున్నావు. నా సొంత పిల్లల విషయం వదిలెయ్. ఏ తండ్రికి కూడా లభించని సేవను నీవు నాకు అందిస్తున్నావు. కదా...'' సాంబమూర్తి కళ్లవెంట ఏకధాటిగా కన్నీరు ప్రవహించింది. వెంకట్ ఒక టవల్‌తో మృదువుగా వత్తాడు. ఏమేమో మనో వికారాలు అతని గుండెలో దడదడ కొట్టుకోవడం ప్రారంభించాయి. దిండు క్రింద నుంచి ఒక పొట్లాం తీసి, దాన్ని వెంకట్ చేతిలో భద్రంగా పెట్టాడు.

''నాయనా దీన్ని నీ దగ్గర వుంచుకో. దీనిలో ఐదువేల రూపాయలున్నాయి. నేను చచ్చిపోయిన తర్వాత, నా అంత్యక్రియలు నువ్వే చేయాలి.''

''అంకుల్ం అన్నయ్యలు చేయాల్సిన కర్మ వాళ్లే చేయాలి గదా!'' అని వెంకట్ ప్రశ్నించేటప్పుడు, అతని పెదవులు వణికాయి.

''నేను చచ్చిపోయిన వివరం వాళ్లకు తెలిపినా, వాళ్లు ఇక్కడకు రావడానికి కనీసం రెండు మూడు రోజులు పడుతుంది. అంతవఱకు నా శవం అక్కడ మార్చురిలో గాని, కొన్ని మంచుగడ్డల మధ్యలో గాని రాయిలా పడివుండాలా? నాకది ఇష్టం లేదు. నేను పోయింతర్వాత అదేరోజు నా దహనం జరగాలి. నా శరీరాన్ని, చీమలు పట్టి, ఈగలు వాలడం - అది తలచుకొంటేనే, నాకు అసహ్యంగా వుంది. ఎలక్ట్రిక్ క్రిమిటోరియంలో దహనం చేయడమే నాకిష్టం, ప్రత్యేకమైన క్రియలు ఏమి అఖ్ఖర లేదు. నా అస్థికలను ఏదైనా నదిలో కలపాలని వుంటే కలిపేసేయ్. నాకు అలాంటిది

ఏమి కావాలని కూడా లేదు. కాని దానికంతా ఖర్చు చేయాలని వుంటే దానికి కావాల్సిన డబ్బే ఇది. నాయనా, నాకొక ప్రత్యేకమైన కోరిక వుంది. నేను మరణించిన విషయం అమెరికాలో వాళ్లకు... ఫోన్ ద్వారా గాని, టెలిగ్రాం ద్వారా గాని తెలుపగూడదు. వాళ్లకు అనవసరమైన ఖర్చులు చేయించ కూడదు. నీ తండ్రితో గూడ ఈ విషయం నేను మాట్లాడుతాను. అన్నీ అయిపోయిం తర్వాత నువ్వుగాని నీ తండ్రి గాని, నా పిల్లలకు ఒక ఉత్తరం రాస్తే చాలు. అంత ఆలస్యంగా వాళ్లకు తెలిసినపుడు, ఇంక అనవసరమైన ఖర్చు ఎందుకని వాళ్లే అనుకుంటారు. తరవాత ఎప్పుడైనా వాళ్లు వస్తే, ఈ ఇంట్లో వున్న వస్తువులన్నీ వాళ్లకు కావాలి అనుకుంటే తీసుకుపోతారు లేకపోతే ఇదంతా నీదే. దీనికి కావాల్సిన వీలునామా ముందే తయారు చేసి, నేను అ అల్మైరా లోపల వుంచాను. దక్షిణామూర్తితో దీన్ని గురించి ఈరోజో, రేపో నేను వివరంగా చెప్తాను'' అని వెంకట్ వీపును నిమురుతూ సాంబమూర్తి చెప్పడం ముగించాడు. ఇంకేదైనా ప్రశ్న అడగడానికి వీలు లేకుండా ఎంతో దుఃఖంతో కూర్చున్న, ఆ యువకుడి రెండు చేతులు తన చేతుల్లో పెట్టుకుని సాంబమూర్తి మెల్లగా అన్నాడు... ''నాయనా! నువ్వే నా బిడ్డవి... నాకున్న ఒకే ఒక్క బిడ్డవి నువ్వే.''

* * *

తరవాత కొన్ని రోజులకే సాంబమూర్తి మరణించాడు. అతని అంత్య క్రియలన్నీ వెంకట్ చేశాడు. సూర్యప్రకాష్‌కు, సూర్యకాంత్‌కు దక్షిణామూర్తి వివరంగా ఉత్తరాలు రాశాడు. దానికి జవాబుగా సూర్యకాంత్ ఉత్తరం ఎక్కువ ఆలస్యం కాకుండా వచ్చింది. దానిలో, దక్షిణామూర్తికి, అతని కుటుంబానికి కృతజ్ఞతలు తెలుపుతూ మాత్రమే రాశాడు. కాని, హైదరాబాద్‌కు వచ్చే విషయం మాత్రం ఏమీ ఎత్తలేదు.

* * *

ఆ సూర్య సహోదరులు, ఆ శీతల ప్రదేశాన్నుంచి, ఈ ఉష్ణ ప్రదేశానికి రాలేదని ఇప్పటిదాకా వున్న వదంతి.

---